# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY

PUBLISHED FROM KURNOOL   ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి   శనివారం 23-11-2024   సంపుటి : 06   సంచిక : 55   పేజీలు : 8   వెల : రూ 3-00





### ఇండియన్ ఫుట్వేర్ షాపును ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్

నంద్యాల సాయిబాబా టెంపుల్ దగ్గర మున్సిపల్ కాంప్లెక్స్ మూడో నెంబరు షాప్ లో నూతనంగా ఏర్పాటు చేసిన ఇండియన్ ఫుట్వేర్ షాప్ ఓపెనింగ్ ఈరోజు శుక్రవారం మధ్యాహ్నం రెండున్నర గంటలకు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ గారి చేతులు మీదుగా ఇండియన్ ఫుట్వేర్ షాప్ ఓపెనింగ్ చేయడం జరిగింది ఈ షాపులో సరసమైన ధరలకు మంచి క్వాలిటీ గల చెప్పులు లభించును . ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ ఇంచార్జ్ మనీయర్ ఖలీల్ అహ్మద్ గారు ఐయూఎంఎల్ నాయకులు సలాం మౌలానా మౌలానా ఇమ్రాన్ పలు పార్టీలకు సంబంధించిన నాయకులు జమాతే తబ్లీ ముఫ్తీ రఫీ గారు మరియు భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొనడం జరిగినది


## ముగిసిన మోదీ విదేశీ పర్యటన.. స్వదేశానికి పయనం



న్యూఢిల్లీ నవంబర్ 22 భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ విదేశీ పర్యటన ముగిసింది. నవంబర్ 16 నుంచి 21 వరకూ రెండు ఖండాల్లోని మూడు దేశాల్లో మోదీ పర్యటించిన విషయం తెలిసిందే. తాజాగా ఐదు రోజుల విదేశీ పర్యటను ముగించుకొని మోదీ స్వదేశానికి పయనమయ్యారు ఇవాళ ఉదయం గయానా నుంచి భారత్‌కు బయల్దేరారు. మోదీ ముందుగా నైజీరియా అధ్యక్షుడు బోలా అహ్మద్ టినుబు ఆహ్వానం మేరకు ఈనెల 16 ? 17 తేదీల్లో నైజీరియాలో పర్యటించారు. 17 ఏళ్లలో భారత ప్రధాని నైజీరియాలో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ సందర్భంగా ప్రధాని మోదీ రెండు దేశాల మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని సమీక్షించడంతోపాటు ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించారు. పర్యటనలో భాగంగా నైజీరియాలోని భారతీయుల్ని ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. నైజీరియా పర్యటనను ముగించుకొని ప్రధాని బ్రెజిల్ పర్యటనకు వెళ్లారు. నవంబర్ 18, 19 తేదీల్లో బ్రెజిల్ అధ్యక్షుడు లూయిస్ ఇనాసియో లులా డా సిల్వా ఆధ్వర్యంలో రియోడిజనీరో నగరంలో జరిగిన జీ-20 సదస్సులో పాల్గొన్నారు. ఈ సమ్మిట్‌లో పలువురు ప్రపంచ నేతలతో ప్రధాని ద్వైపాక్షిక సమావేశాలు నిర్వహించారు. ఆ తర్వాత మోదీ గయానాకు వెళ్లారు. 56 ఏళ్ల తర్వాత (1968 తర్వాత) భారత ప్రధాని ఒకరు గయానాలో పర్యటించడం ఇదే తొలిసారి. ఈ పర్యటనలో గయానా అధ్యక్షుడు మొహమ్మద్ అలీతో మోదీ చర్చలు జరిపారు. ఇతర సీనియర్ నాయకులతోనూ సమావేశం అయ్యారు. ఇక ఈ పర్యటనలో మోదీకి అరుదైన గౌరవం లభించింది. గయానా, డొమెనికా దేశాలు తమ అత్యున్నత పురస్కారాలతో ప్రధానిని సత్కరించాయి.


## వైకాపా హయాంలో అధికారయంత్రాంగం నిర్వీర్యమైంది

### చరిత్రలో ఏ రాజకీయ నాయకుడు చేయనన్ని తప్పులు చేశాడు.. జగన్‌పై ఏపీ సీఎం చంద్రబాబు ధ్వజం



అమరావతి నవంబర్ 22(ఆంధ్రరేఖ ప్రతినిధి) గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అవినీతి, విధ్వంసం జరిగిందని ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా విజన్ డాక్యుమెంట్ 2047పై శుక్రవారం చర్చ జరిగింది. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ.. ఏపీ బ్రాండ్‌ను జగన్ దెబ్బతీశారని అన్నారు. గతంలో వ్యవస్థలు విధ్వంసమయ్యాయని అన్నారు. అధికార యంత్రాంగం నిర్వీర్యమైందని చెప్పారు. చరిత్రలో ఏ నాయకుడు చేయనన్ని తప్పులు గత ముఖ్యమంత్రి జగన్ చేశారని చంద్రబాబు మండిపడ్డారు. అధికార యంత్రాంగం నిర్వీర్యమైందని.. అప్పులు పరాకాష్టకు చేరాయని తెలిపారు. వాస్తవాలను పక్కనబెట్టి వాళ్లు నమ్మిన అవాస్తవాలను ప్రచారం చేశారని చంద్రబాబు అన్నారు. బరితెగించి తప్పులు చేసి, ఆ తప్పులను ఒప్పులుగా చిత్రీకరించారని మండిపడ్డారు. గతంలో విజన్ 2020 తీసుకొచ్చానని.. ఇప్పుడు స్వర్ణాంధ్ర విజన్ 2047 తీసుకొస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఎవరు వచ్చినా ఈ విజన్ చెడిపోకుండా ఫౌండేషన్ వేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో అమరావతిని విధ్వంసం చేశారని చంద్రబాబు అన్నారు. భద్రత లేకుంటే రాష్ట్రంలో పెట్టుబడులకు ముందుకు రారని అన్నారు. లా అండ్ ఆర్డర్ సరిగ్గా లేకపోతే పెట్టుబడులు రావని పేర్కొన్నారు. రౌడీ రాజకీయాలు చేస్తామంటే పెట్టుబడిదారులు రాష్ట్రానికి రారని చెప్పారు. రాజకీయం ప్రజల కోసమే కానీ.. స్వార్థం కోసం కాదని హితవు పలికారు

### ఈనెల 28 నుంచి తిరుచానూరు
## పద్మావతి బ్రహ్మోత్సవాలు




తిరుపతి నవంబర్ 22( ఈనెల 28 నుంచి డిసెంబర్ 6వ తేదీ వరకు తిరుచానూరు పద్మావతి అమ్మవారి వార్షిక బ్రహ్మోత్సవాలకుఏర్పాట్లు చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామల రావు అధికారులను ఆదేశించారు. టీటీడీ పరిపాలనా భవనంలో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అన్ని విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన పంచమి తీర్థం రోజు భక్తులకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. హోల్డింగ్ పాయింట్ల లో ఉండే వేచి ఉండే భక్తులకు సౌకర్యవంతంగా మంచినీరు, అల్పా హారంతో పాటు మరుగుదొడ్లను, అవసరమైన సిబ్బందిని అందుబా టులో ఉంచాలన్నారు. ఆరోగ్యశాఖ అధికారులు పారిశుద్ధ్యం విషయంలో జాగ్రత్తలు తీసుకుని స్థానిక పంచాయతీ అధికారులతో సమన్వయం చేసుకోవాలన్నారు. వైద్య విభాగం అధికారులు ప్రథమ చికిత్స కేంద్రాలను, అంబులెన్సులను ఏర్పాటు చేయాలన్నారు. భక్తులందరికీ అన్నప్రసాదం విరివిగా అందేలా చర్యలు చేపట్టాలని అన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ద్వారా నిర్వహించే స్టేజ్ కార్యక్రమాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నాణ్యమైనవిగా ఉండాలని సూచించారు. ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో వైట్ వాష్, కలర్ పెయింటింగ్, ఫ్లెక్సీ బోర్డులు ఏర్పాటు చేయాలని చెప్పారు.

### శ్రీవారి హుండీ ఆదాయం రూ. 3.27 కోట్లు

తిరుమలలో ) భక్తుల రద్దీ కొనసాగుతుంది. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో 19 కంపార్టుమెంట్లు నిండిపోగా టోకెన్లు లేని భక్తులకు 18 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని వివరించారు. నిన్న స్వామివారిని 60,803 మంది భక్తులు దర్శించుకోగా 21,930 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీకి రూ. 3.27 కోట్లు ఆదాయం వచ్చిందన్నారు.

## ఏపీలో పీఏసీ ఎన్నికలను బహిష్కరించిన వైసీపీ




అమరావతినవంబర్ 22 : ఆంధ్రప్రదేశ్ కూటమి ప్రభుత్వం వైసీపీ పక్షానికి ఊపిరి సలపనివ్వడం లేదు. గత 5 నెల లుగా ప్రతిపక్ష హోదాకోసం డిమాం డ్ చేస్తున్న వైసీపీ కనీసం పీఏసీ చైర్మన్‌గా నైనా అవకాశం వస్తుందని ఊహించారు. కాని అందుకు భిన్నం గా ప్రభుత్వం వైసీపీ డిమాండ్లను ఖాతరు చేయడం లేదు. తాజాగా అసెంబ్లీలో ప్రతిపక్షానికి పీఏసీ చైర్మన్ పదవి ఇవ్వడం ఆనవా యితీగా వస్తుంది. ఈసారి వైసీపీకి వస్తుందని ధీమాలో ఉండి నిన్న వైసీపీ ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచం ద్రారెడ్డి పీఏసీ చైర్మన్‌గా నామినేషన్ వేశారు. వాస్తవానికి పీఏసీలో 12 మంది సభ్యులకు గాను 9 ఎమ్మెల్యే లు, 3గురు ఎమ్మెల్సీలు ఉంటారు. అయితే కూటమి ప్రభుత్వంలో ఉన్న 164 మంది మెజారిటీ ఉండడంతో టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యేలతో నామినేషన్ వేయించడంతో వైసీపీ కంగుతిన్నది. ఇరుపార్టీల నుంచి పోటీ నెలకొనడంతో శుక్రవారం అసెంబ్లీ హాల్‌లో పోలింగ్ నిర్వహించారు. పోలింగ్ కేంద్రానికి వచ్చిన సభ్యులు అక్కడి పరిస్థితిని చూసి ఎన్నికలను బైకాట్ చేస్తున్నట్లు ప్రకటించి అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేనివిధంగా ప్రజా పద్దుల కమిటీ (పీఏసీ)కి ఎన్నికలు నిర్వహించాల్సి రావడం దురదృష్టకరమని అన్నారు. వైసీపీ హయాంలో సభ్యుల సంఖ్యతోసంబంధం లేకుండా టీడీపీ ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు పీఏసీ చైర్మన్ ఇచ్చామని గుర్తు చేశారు. వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఓటింగ్‌ను బహిష్కరించగా కూటమిలోని మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.

## 23న మళ్లీ అల్పపీడనం.. ఏపీలో వర్షాలకు అవకాశం




అమరావతినవంబర్ 22 : ఈనెల 23న ఆగ్నేయ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుందని విపత్తుల నిర్వహణ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా తెలిపారు. అల్పపీడనం రెండురోజుల్లో వాయుగుండంగా మారే అవకాశముందని తెలిపారు. ఫలితంగా అల్పపీడన ప్రభావంతో తమిళనాడు, కేరళలో విస్తారంగా, దక్షిణ కోస్తా, రాయలసీమలో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని వివరించారు. వర్షాల కారణంగా వ్యవసాయ పనుల్లో రైతులుపలుజాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. విపత్కర పరిస్థితులను ఎదుర్కొనేందుకు అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు

## జిల్లాలో 400 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగు

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 22-రైతులు అధిక లాభాలను ఇచ్చే ఆయిల్ ఫామ్ సాగుపై మొగ్గు చూపాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం రుద్రవరం మండలం పెద్ద కంబలూరు గ్రామంలో ఆయిల్ ఫామ్ సాగుపై నిర్వహించిన అవగాహన సదస్సులో కలెక్టర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రైతులు సాంప్రదాయ పంటలకు ప్రత్యామ్నాయంగా అధిక లాభాలనిచ్చే ఆయిల్ ఫామ్ సాగుపై మొగ్గుచూపి మంచి దిగుబడులు సాధించాలన్నారు. ప్రభుత్వం కూడా ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహిస్తూ పెద్ద ఎత్తున రాయితీలను ఇస్తోందన్నారు. జిల్లాలో ఆరు లక్షల ఎకరాల భూములలో రైతులు సాగు చేసుకుంటున్నారని ఇందులో దాదాపు 5 లక్షల ఎకరాలు వివిధ సాగునీటి ప్రాజెక్టులు, కాలువల కింద సాగునీరు అందుతుందన్నారు. ఉద్యాన పంటల కింద దాదాపు లక్ష ఎకరాలలో సాగవుతున్నాయని...ఇందులో 400 హెక్టార్లలో ఆయిల్ ఫామ్ సాగవుతోందని జిల్లాలో ఇంకా ఉద్యాన పంటలు సాగు చేసుకునే అవకాశం ఉందని రైతులకు లాభదాయకంగా ఆయిల్ ఫామ్ సాగు పంటల వైపు రైతులు ముందుకు రావాలన్నారు. ఇందులో భాగంగానే నాలుగు కంపెనీలు ముందుకు వచ్చాయని మొదటి విడతగా 100 హెక్టార్లు 3 ఎఫ్ ఆయిల్ ఫామ్ ప్రైవేట్ లిమిటెడ్ కు ఇచ్చామని కలెక్టర్ తెలిపారు. ఆయిల్ ఫామ్ మొక్కలను నాటిన తర్వాత నాలుగో సంవత్సరం నుండి దిగుబడులు ప్రారంభమవుతాయన్నారు. ఆయిల్ ఫామ్ సాగు వల్ల కలిగే లాభాల గురించి రైతులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తూ ఆసక్తి కలిగి ఉన్న రైతులకు ఆయిల్ ఫామ్ సాగు చేసేలా చూడాలని ఈ సందర్భంగా కలెక్టర్ ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతులకు కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. ఉద్యాన శాఖ అధికారి నాగరాజు, డ్వామా పిడి జనార్దన్ రావు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు. అంతకుముందు మహానంది మండలం గాజులపల్లి గ్రామ రైతు వేసిన ఐదు ఎకరాల రోజా పూల తోటను పరిశీలించి చక్కగా ఉందని ప్రశంసిస్తూ వివరాలు అడిగి తెలుసుకున్నారు

# సంపాదకీయం


శనివారం 23-11-2024

## పిల్లలకు సోషల్ మీడియా నిషేధం....

ప్రస్తుతం చిన్నపిల్లల దగ్గర నుంచి వృద్ధుల వరకు మొబైల్ ఫోన్‌తోనే ఎక్కువ సేపు గడుపుతున్నారు. దీనికి తోడు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చాక ఈ పరిస్థితి మరీ తీవ్రమైంది. ఎప్పుడైనా సోషల్ మీడియా యాప్‌ల్లో అంతరాయం కలిగితే వినియోగదారులు ఎంతో గాబరా పడుతుంటారు. దీన్ని బట్టి సోషల్ మీడియా ప్రభావం మనుషులపై ఎంతగా ఉంటుందో చెప్పవచ్చు. అయితే ఈ వినియోగం పిల్లల జీవితంపై ఎక్కువ వ్యతిరేక ప్రభావం చూపే అవకాశం కనిపిస్తోంది. పిల్లలు మానసిక కుంగుబాటుతో పాటు అనేక సమస్యలకు గురవుతున్నారు. ముఖ్యంగా అమ్మాయిల విషయంలో అశ్లీల దృశ్యాలు, చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారడం పరిపాటి అవుతోంది. దీనిపై ప్రపంచ వ్యాప్తంగా ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా ప్రభుత్వం 16 ఏళ్ల లోపు పిల్లలకు సోషల్ మీడియాను నిషేధించేలా చట్టాన్ని తీసుకురాడానికి విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకోవడం స్వాగతించాల్సిందే. నవంబర్ 18న ఆస్ట్రేలియా పార్లమెంట్ సమావేశంలో ఈ చట్టాన్ని ప్రవేశపెట్టనున్నట్టు ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ప్రకటించారు. ప్రజా ప్రతినిధులు ఆమోదించిన 12 నెలల తరువాత ఈ చట్టం అమలులోకి వస్తుందని చెప్పారు. తల్లిదండ్రుల సమ్మతి ఉన్న పిల్లలకు లేదా ఇప్పటికే అకౌంట్స్ ఉన్న పిల్లలకు కూడా ఇందులో మినహాయింపు ఉండబోదని స్పష్టం చేశారు. ఈ చట్టం అమలైన తరువాత ఎక్స్, టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లు 16 ఏళ్ల లోపు పిల్లలను తమ సైట్ల నుంచి ఎలా మినహాయించాలో ఆలోచించాలని సూచించారు. నిర్దేశించిన వయో పరిమితిని సోషల్ మీడియా సంస్థలు ఉల్లంఘిస్తే జరిమానా తప్పదు. పిల్లలకు, వారి తల్లిదండ్రులకు ఈ జరిమానా వర్తించదు. చిన్నపిల్లలకు యాక్సెస్ నిరోధించే బాధ్యత సోషల్ మీడియా సంస్థలదే. ఆ బాధ్యత తల్లిదండ్రులు లేదా యువతపై ఉండదు. దీనిపై ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ మాతృసంస్థ మెటా, హెడ్ ఆఫ్ సేఫ్టీ యాంటిగోన్‌డేవిస్ ప్రభుత్వం నిర్ణయంచే వయో పరిమితులను తమ సంస్థ గౌరవిస్తుందని చెప్పారు. అయితే ఈ నిబంధనలను ఎలా అమలు చేయాలన్న దానిపై లోతైన చర్చ అవసరమన్నారు. యాప్ స్టోర్‌లలో, ఆపరేటింగ్ సిస్టమ్‌లలో సమర్థవంతమైన టూల్స్‌తో తల్లిదండ్రులు వారి పిల్లలు ఏ యాప్ వాడాలో నియంత్రించవచ్చని చెప్పారు. ఇది చాలా సులభమైన, సమర్థవంతమైన పరిష్కారం అని అభిప్రాయపడ్డారు. గత ఏడాది 15 ఏళ్ల లోపు వారికి సోషల్ మీడియా వాడకంపై నిషేధం విధించాలని ఫ్రాన్స్ ప్రతిపాదించింది. కానీ వినియోగదారులు, తల్లిదండ్రుల సమ్మతితో నిషేధాన్ని దాటవేయగలిగారు. అమెరికాలో 13 ఏళ్ల లోపు పిల్లలు సోషల్ మీడియాను యాక్సెస్ చేయాలంటే తల్లిదండ్రుల సమ్మతి తప్పనిసరిగా ఉండాల్సిందే. 13 ఏళ్లకన్నా తక్కువ వయసు పిల్లలకు సోషల్ మీడియా నిషేధించాలని చాలా సోషల్ మీడియా సంస్థలు విధానాలను ఏర్పర్చుకున్నాయి. బ్రిటన్ మీడియా రెగ్యులేటర్ 'ఆఫ్‌కామ్' 2022లో నిర్వహించిన అధ్యయనంలో బ్రిటన్ లోని 80% మంది పిల్లలు 12 ఏళ్ల వయసులోనే సోషల్ మీడియా అకౌంట్లు కలిగి ఉన్నారని బయటపడడం విశేషం. అమెరికా సర్జన్ జనరల్స్ ఆఫీస్‌కు చెందిన 2023 అడ్వైజరీ అధ్యయనంలో సోషల్ మీడియా నుంచి పిల్లలను నెల రోజుల కన్నా ఎక్కువ కాలం దూరంగా ఉంచితే వారికి మానసిక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టమైంది. మన దేశంలో లోకల్ సర్కిల్స్ అనే సంస్థ సోషల్ మీడియాకు ఏ విధంగా నిమగ్నం అయిపోతున్నారో అధ్యయనం నిర్వహించింది. సోషల్ మీడియా ప్రభావం 9 ఏళ్ల నుంచి 17 ఏళ్ల పిల్లలపై ఎలా ఉంటుందో తెలుసుకోడానికి ఆగస్టు 16 నుంచి అక్టోబర్ 31 వరకు 368 అర్బన్ జిల్లాల్లో 13,743 మంది తల్లిదండ్రులపై సర్వే చేయగా 70,000 స్పందనలు వచ్చాయి. 66 శాతం తల్లిదండ్రుల్లో 47% మంది తమ పిల్లలు ప్రతిరోజూ మూడు నాలుగు గంటలు, 10 శాతం తల్లిదండ్రులు తమ పిల్లలు ఆరు గంటలకు మించి సోషల్ మీడియాలోనే లీనమైపోతున్నారని వెల్లడించారు. 58% తల్లిదండ్రులు తమ పిల్లల్లో దూకుడుతనం కనిపిస్తోందని, 49% తల్లిదండ్రులు తమ పిల్లలు అసహనంగా ఉంటున్నారని, మరో 49% మంది తమ పిల్లలు నీరసంగా ఉంటున్నారని తెలిపారు. 42 శాతం మంది తమ పిల్లలు కుంగుబాటుకు గురవుతున్నారని, 30% మంది తమ పిల్లలు అన్ని విషయాల్లో అత్యుత్సాహం చూపిస్తుంటారని చెప్పారు. ఏదేమైనా పిల్లల మానసిక ప్రవర్తనపై, ఆరోగ్యంపై సోషల్ మీడియా అనేక విధాలుగా వ్యతిరేక ప్రభావం చూపిస్తున్నట్టు స్పష్టమవుతోంది. అయితే ఆస్ట్రేలియాలో పిల్లలకు సోషల్ మీడియా నిషేధం అమలు ఎలా సాధ్యమవుతుందో ముందుముందు గమనించాల్సిందే.

# కోట్లాది భక్తులకు ఆధ్యాత్మిక గురువు భగవాన్ శ్రీ సత్య సాయి బాబా

### -నేడు బాబా జయంతి



కోట్లాది భక్తులకు ఆయన ఆధ్యాత్మిక గురువు. ఆయన కులాలకు, మతాలకు అతీతంగా నిలిచారు. ఆయన భక్తులలో హిందువులతో పాటు ముస్లింలు, క్రిస్టియన్లు కూడా చాలామంది ఉన్నారు. సత్యసాయి బాబా వారు సత్యనారాయణ రాజుగా 1926 నవంబరు 23న పెద్ద వెంకప్ప రాజు, ఈశ్వరమ్మ దంపతులకి, ఓ నిరుపేద వ్యవసాయ భట్టు రాజుల కుటుంబంలో అనంతపురం జిల్లా లోని, పుట్టపర్తి అనే కుగ్రామంలో జన్మించాడు. బాబాకు నలుగురు సోదరులు, ఇద్దరు సోదరీమణులు. బాబా చిన్న వయసులోనే చాలా అద్భుతాలు చేశాడని చెబుతారు. చిన్న వయసులోనే బాబా అపర మేధావి, సేవాభావం గల వ్యక్తిగా ముద్ర పడ్డారు. అపర మేధావి అయిన బాబాకు నాట్యంలో, సంగీతంలో, రచనలలో మంచి పట్టు ఉంది. బాబా స్వయంగా పాటలు, పద్యాలు రాసి భక్తులను వినిపించాడు. 1940వ సంవత్సరం మార్చి 8వ తేదిన తన సోదరుడు శేషమ రాజుతో కలిసి ఉరవకొండలో ఉన్న సమయంలో బాబాను ఓ తేలు కుట్టిందంట. ఆ సమయంలో బాబా తన స్పృహను కోల్పోయారంట. తేలు కుట్టిన కొద్ది రోజులకు బాబా బిహేవియర్‌లో మార్పు వచ్చింది. తనకు తాను నవ్వుకోవడం, ఏడ్వటం, అప్పటికప్పుడే నిశ్శబ్దంగా మారి పోవడం చేసేవారు.

ఆ సమయంలో ఇతను తనకు ఇంతకుముందు ఏ మాత్రం పరిజ్ఞానం లేని సంస్కృతంలో పాటలు పాడేవారు. బాబా పరిస్థితి చూసి వైద్యులు హిస్టేరియా అని నమ్మేవారు. దీంతో చేసేది లేక బాబా తల్లిదండ్రులు బాబాను పుట్టపర్తికి తీసుకు వచ్చారు. వారు బాబాను అనేకమంది వైద్యుల వద్దకు, ఆధ్యాత్మిక గురువుల వద్దకు తీసుకు వెళ్లారు. మే 23 1940లో బాబా చేసిన ఓ చర్య వల్ల బాబా తండ్రి బాబాను ఓ అద్వితీయ మహోన్నతుడుగా భావించాడు. బాబా తండ్రి ఓ కర్ర తీసుకొని నీవెవరు అని అడిగాడు. అప్పుడు బాబా తాను షిరిడీ సాయిబాబా ప్రతిరూపాన్ని అని చెప్పాడు. ఆ తర్వాత బాబా తనకు ఎవరితోనూ సంబంధం లేదని చెప్పారు. తాను షిర్డీ సాయికి ప్రతిరూపం అని చెప్పడం, తనకు ఎవరితోనూ సంబంధాలు లేవని చెప్పడంతో ఆయనకు భక్తులు తయారవడం ప్రారంభం అయింది. పద్నాలుగేళ్లకే బాబా ఆధ్యాత్మిక మార్గం పట్టారు. ఆ తర్వాత సత్యసాయి మద్రాసుకు, దక్షిణ భారతంలో పర్యటనలు ప్రారంభించారు. దీంతో తొందరగానే ఆయనకు భారీ సంఖ్యలో భక్తులు తయారయ్యారు. 1944వ సంవత్సరంలో భక్తులు బాబా స్వగ్రామం పుట్టపర్తిలో ఓ మందిరాన్ని నిర్మించారు. ఆ తర్వాత 1948లో ప్రారంభం అయిన ప్రశాంతి నిలయం 1950కి పూర్తయింది. 1957వ సంవత్సర కాలంలో బాబా ఉత్తర భారత దేశ దేవాలయాల సందర్శనకు వెళ్లారు. 1954లోనే బాబా చిన్న పాటి గ్రీన్ హాస్పిటల్‌ను పుట్టపర్తిలో నిర్మించారు. 1963లో బాబాకు నాలుగుసార్లు గుండెనొప్పి వచ్చింది. ఆ సమయంలో బాబా తాను మరణించాక కర్ణాటకలో ప్రేమసాయి అవతారం ఎత్తుతానని చెప్పారు. ఆ తర్వాత 1968 జూన్ 29న బాబా మొదటిసారి విదేశాలకు వెళ్లారు. ఉగండా, నైరోబీ తదితర దేశాలకు వెళ్లారు. ఆయా దేశాలకు వెళ్లిన బాబా తాను ఏ మతపరంగా రాలేదని ప్రేమను పంచడానికే వచ్చానని చెప్పారు. తనవైపు ఎవరినీ తిప్పుకోవడానికి, ప్రలోభ పెట్టడానికి రాలేదని, కేవలం ప్రేమ పంచి, ఎవరిపై వారికి నమ్మకం కలిగించడానికే వచ్చానని ఆయా దేశాలలో చెప్పేవారు. మన రాష్ట్రం రాజధానిలో ప్రసిద్ధి పొందిన శివం మందిరాన్ని 1973లో ఎస్టాబ్లిష్ చేశారు. అలాగే 1981 జనవరి 19న చెన్నైలో సుందరం మందిరాన్ని ప్రారంభించారు. 1995లో రాయల సీమ ప్రాంతంలో బాబా నీటి ప్రాజెక్టు పనులు చేపట్టారు. 2001లో పుట్టపర్తిలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్మించారు. బాబా 2005వ సంవత్సరం నుండి వీల్ చైర్‌కే పరిమితం అయ్యారు. తాను దేహం కలవాడిని కాదని, దేహిని అని చెప్పారు. తాను నిర్యాణం చెందినప్పటికీ మళ్లీ పుడతానని పలు సందర్భాలలో చెప్పారు. ప్రతి దేహం గిట్టక తప్పదని చెప్పారు. బాబా తన భజనల సీడీలను చాలా విడుదల చేశారు. ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది భక్తులను, వేల సేవాకేంద్రాలు, ప్రజలకు నీటి సౌకర్యం కల్పించిన శ్రీ భగవాన్ సత్యసాయి బాబ తాను స్థాపించిన సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లోనే గత నెల 28న మంచాన పడ్డారు. 28 రోజుల అనంతరం బాబా ఆదివారం ఏప్రిల్ 24న ఉదయం 7.40 నిమిషాలకు నిర్యాణం చెంది బాబా భక్తులలో విషాదం నింపారు.

## పంజాబ్ ఆప్ రాష్ట్ర అధ్యక్షుడిగా అమన్ అరోరా



చండీఘడ్: పంజాబ్ ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షుడిగా సీనియర్ నేత అమన్ అరోరాను నియమించారు. ఆ రాష్ట్ర సీఎం భగవంత్ మాన్ సింగ్ ప్రస్తుతం అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన స్థానంలో అమన్ అరోరా ఆ బాధ్యతలను నిర్వర్తించనున్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అమన్‌షేర్ సింగ్ షెర్రీ కల్సిని ప్రకటించారు. సీఎం భగవంత్ మాన్ స్వయంగా అరోరా పేరును పార్టీ చీఫ్‌గా ప్రకటించారు. పంజాబ్ మంత్రిగా ఉన్న అరోరాను పార్టీ అధ్యక్షుడిగా చేయాలని చాన్నాళ్లుగా వర్క్ జరుగుతోంది. శుక్రవారం ఢిల్లీలో జరిగిన ఆప్ పార్లమెంటరీ స్థాయి కమిటీ మీటింగ్‌లో ఈ నిర్ణయం తీసుకున్నారు. హిందువు అయిన అరోరా.. పంజాబ్‌లోని హిందూ ఓటర్లను ఆకర్షిస్తారన్న అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. పార్టీ అధ్యక్ష పదవి నుంచి తప్పుకోవాలని ఉన్నట్లు ఇటీవల సీఎం భగవంత్ మాన్ తెలిపారు. 2019 నుంచి పార్టీ అధ్యక్ష పదవి ఆయన వద్దే ఉన్నది. సంస్థాగత నైపుణ్యం, సామర్థ్యం ఉన్న వ్యక్తుల్లో అరోరా ఒకరు. రెండుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. 2022 పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో అత్యధిక మెజారిటీతో విజయం సాధించారు. గ్రామీణ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలన్న బాధ్యతలను ఆయనకు అప్పగించారు.

## బీకేర్‌ఫుల్.. పిచ్చకుంట్ల అనే పదం వాడితే క్రిమినల్ కేసు పెడుతాం : నిరంజన్


నాగర్‌కర్నూల్ : రాజకీయ నాయకులు గానీ, ఇతర కులాలు ఎవరైనా పిచ్చకుంట్లఅనే పదం వాడితే వారిపై క్రిమినల్ కేసులు పెడతాం. ఇందుకు ప్రభుత్వం నుంచి త్వరలో ఉత్తర్వులు కూడా ఇస్తామని రాష్ట్ర బీసీ కమిషన్‌చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పిచ్చకుంట్ల అనే పేరు పిలవడం మానేసి వంశరాజ్ పేరు మాత్రమే పిలవాలని బీసీ కమిషన్‌కు విజ్ఞప్తులు వచ్చాయన్నారు. వాటన్నింటిని క్రోడీకరించి ప్రభుత్వానికి నివేదికిస్తామని ఆయన తెలిపారు. కాగా, రాష్ట్ర బీసీ కమిషన్ శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లాలో పర్యటిస్తున్నది. తెలంగాణ రాష్ట్రంలో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన తరగతుల స్థితిగతుల అధ్యయనంలో భాగంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో బి.సి. కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయ ప్రకాష్, తిరుమల గిరి సురేందర్, బాలలక్ష్మి బహిరంగ విచారణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు పాల్గొన్నారు.




## ఢిల్లీలో తీవ్రంగానే గాలి నాణ్యత సూచీ..

### కనిష్ట ఉష్ణోగ్రతలు 11.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు

న్యూఢిల్లీ: దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం తీవ్ర స్థాయిలో కొనసాగుతోంది. శుక్రవారం ఉదయం ఢిల్లీలో కనిష్ట ఉష్ణోగ్రతలు 11.3 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యాయి. దీంతో రాజధాని ప్రాంతాన్ని దట్టమైన పొగమంచు కమ్మేసింది. ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 373తో చాలా పేలవమైన కేటగిరీలో నమోదైంది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి డేటా ప్రకారం.. నగరంలోని మొత్తం 38 మానిటరింగ్ స్టేషన్లలో తొమ్మిదింటిలో ఏక్యూఐ లెవల్స్ తీవ్రమైన కేటగిరీలో నమోదయ్యాయి. ఆనంద్ విహార్, బవానా, జహంగీర్‌పురి, ముండ్కా, నెహ్రూ నగర్, షాదీపూర్, సోనియా విహార్, వివేక్ విహార్, వజీర్‌పూర్‌లో గాలి నాణ్యత సూచీ చాలా అధ్వానంగా ఉంది. ఈ స్టేషన్లలో ఏక్యూఐ లెవల్స్ 400 కంటే ఎక్కువే నమోదైంది. తీవ్ర వాయుకాలుష్యంతో ప్రజలు ఆరోగ్య సమస్యలను నివేదిస్తున్నారు. ఉదయం 8:30 గంటలకు నగరంలో తేమ స్థాయిలు 97 శాతంగా ఉన్నాయి. రోజంతా మోస్తరు పొగమంచు కొనసాగుతుందని భారత వాతావరణ శాఖ అంచనా వేసింది. గరిష్ట ఉష్ణోగ్రతలు 27 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. ప్రస్తుతం ఎన్‌సీఆర్ పరిధిలో గాలి విషపూరితంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. 50శాతం మంది ఉద్యోగులకు వర్క్‌ఫ్రం హోం విధానాన్ని అమలు చేస్తున్నది. ఢిల్లీ ప్రభుత్వంలోని 80 విభాగాలు, వివిధ ఏజెన్సీలతో పాటు ఢిల్లీ మున్సిపల్ కార్పొరేషన్‌లో మొత్తం ఉద్యోగుల సంఖ్య దాదాపు 1.40 లక్షలుగా ఉన్నది. అలాగే, గురుగ్రామ్‌లోని ఐటీ కంపెనీలు సైతం ఉద్యోగులకు ఇంటి నుంచే పని చేసే అవకాశం కల్పిస్తున్నది. గురుగ్రామ్, సోనిపట్, ఫరీదాబాద్‌తో పాటు ఎన్‌సీఆర్‌లోని పలు నగరాల్లో కాలుష్యం కారణంగా కళాశాలలు మూతపడ్డాయి. భవన నిర్మాణం, కూల్చివేతలపై కూడా ప్రభుత్వం నిషేధం విధించింది. పలు వాహనాలను రాజధాని ప్రాంతంలోకి అనుమతించడం లేదు.



## కిమ్‌కు మరిన్ని బహుమతులు.. సింహం, ఎలుగుబంట్లు, బర్రెలు పంపిన రష్యా అధ్యక్షుడు పుతిన్

రష్యా–ఉత్తర కొరియా దేశాల మధ్య బంధం మరింత బలపడుతోంది. ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో రష్యాకు ఉత్తర కొరియా అధినేత కిమ్ పెద్ద ఎత్తున ఆయుధ సహకారం అందిస్తున్న విషయం తెలిసిందే. మరో లక్ష బలగాలను క్రెమ్లిన్‌కు పంపేందుకు కిమ్ అంగీకారం తెలిపారని తెలిసింది. ఈ నేపథ్యంలో ఉక్రెయిన్‌తో యుద్ధంలో తమకు అన్ని విధాలుగా సాయం అందిస్తున్న కిమ్‌కు పుతిన్ బహుమతులు పంపుతున్నారు. ఇప్పటికే అరుదైన జాతి గుర్రాలు, శునకాలు, మేకల్ని పంపిన పుతిన్.. తాజాగా మరికొన్నింటిని గిఫ్ట్‌గా పంపారు. ఏకంగా 70కిపైగా జంతువులను బహుమతిగా పంపినట్లు తెలిసింది. ఇందులో ఒక ఆఫ్రికన్ సింహం, రెండు ఎలుగుబంట్లు, రెండు జడల బర్రెలు, ఐదు తెల్ల కోకాటూలు, 25 రకాల నెమళ్లు, 40 మాండరిన్ బాతులు ఉన్నాయి. వీటన్నింటినీ ప్యాంగ్యాంగ్ సెంట్రల్ జూకు తరలించినట్లు తెలిసింది. కాగా, కిమ్‌కు పుతిన్ ఇలా బహుమతులు పంపడం ఇదేమీ మొదటి సారి కాదు. రెండు దేశాల మధ్య కీలక ఒప్పందాలు కుదిరిన క్రమంలో ఇరు దేశాల అధినేతలు ఒకరికొకరు గిఫ్ట్‌లు ఇచ్చుకుంటున్నారు. రెండేళ్ల క్రితం 30 ఒర్లావో ట్రోటర్ గుర్రాల్ని కిమ్‌కు అందజేశారు. కిమ్ ఈ ఏడాది జూన్‌లో పుతిన్‌కు అరుదైన శునకాల్ని బహుమతిగా పంపగా, పుతిన్ ఆగస్టులో కిమ్‌కు 447 మేకల్ని బహుమతిగా పంపారు. తన మిత్రదేశమైన రష్యాకు మరిన్ని బలగాలను పంపడానికి ఉత్తర కొరియా నిర్ణయించింది. ఉక్రెయిన్‌తో రష్యా జరుపుతున్న యుద్ధంలో సహాయంగా లక్ష బలగాలను ఆ దేశానికి పంపేందుకు ఆ దేశ అధినేత కిమ్ అంగీకారం తెలిపారని తెలిసింది. దశలవారీగా వీరిని పంపనున్నట్టు సమాచారం. ఇప్పటికే రష్యాకు 15 వేల మంది ఉత్తరకొరియా సైనికులకు కిమ్ పంపారు. దీనిపై పొరుగుదేశమైన దక్షిణ కొరియా, అమెరికా అభ్యంతరాలు చెప్తున్నా ఆయన లెక్కచేయడం లేదు. కిమ్ చర్యలతో ఉక్రెయిన్, మిత్రదేశాలు ఉలిక్కిపడుతున్నాయి. ఈ చర్య ఇండో పసిఫిక్ రీజియన్‌పై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తమవుతున్నది.



# జగన్ కు ఆదానీ దెబ్బ,,,,



విజయవాడ, నవంబర్ 22, దేశంలోని ప్రముఖ వ్యాపారవేత్త గౌతమ్ అదానీకి సంబంధించిన ఓ వ్యవహారం దేశవ్యాప్తంగా దుమారం రేపుతోంది. సోలార్ విద్యుత్ కొనుగోలుకు సంబంధించిన ఓ భారీ డీల్ కుదుర్చుకునేందుకు.. ప్రభుత్వ అధికారులకు పెద్ద మొత్తంలో లంచం ఇచ్చేందుకు ప్రయత్నించారంటూ ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై అమెరికాకు చెందిన ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్-ఎఫ్‌బీఐ విచారణ చేపట్టింది.ఈ వివాదాస్పద వ్యవహారం క్రమంగా.. ఆంధ్రప్రదేశ్ గత సర్కార్ కు చుట్టుకుంటోంది. 2019- 2024 మధ్య అధికారంలోని ప్రభుత్వంతో గౌతమ్ అదానీ.. ఈ చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నడిపినట్లు అమెరికా విచారణ సంస్థ ఎఫ్‌బీఐ పరిశోధనలో వెల్లడైంది. ఇందుకోసం.. దాదాపు రూ.1,750 కోట్లు చేతులు మారినట్లు అమెరికా విచారణ సంస్థ.. ఆ దేశ కోర్టుకు సమర్పించిన ఫైలింగ్ లో వెల్లడించింది.లాభదాయకమైన సౌరశక్తి సరఫరా ఒప్పందాలను పొందేందుకు భారత ప్రభుత్వ అధికారులకు రూ. 2.029 కోట్లు లంచం ఇచ్చినందుకు అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సాగర్ అదానీ, మరో ఆరుగురు వ్యక్తుల ప్రయత్నించినట్లు ఎఫ్‌బీఐ ఆరోపించింది. ఈ వ్యవహారంలో మరింత లోతైన దర్యాప్తు చేపడతామని ప్రకటించిన అమెరికా విచారణ సంస్థ.. ప్రాథమిక నివేదికను కోర్టుకు అందించింది. ఈ కుట్రలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలోని కీలక వ్యక్తి సహకారం ఎక్కువగా ఉందన్న ఎఫ్‌బీఐ.. తేదీలతో సహా వారి మధ్య భేటీలను వెల్లడించి, ఆశ్చర్యపరిచింది.భారత్ లో అతిపెద్ద సోలార్ ఎనర్జీ ప్రాజెక్టును దక్కించుకునేందుకు గౌతమ్ అదానీ, అతని మేనల్లుడు సహా మరో ఆరుగురు.. ప్రభుత్వ అధికారులకు లంచాలు ఇవ్వజూశారని అమెరికాకు చెందిన ఎఫ్‌బీఐ ఆరోపిస్తోంది. అయితే.. ఈ ఒప్పందాలను చూపించి బ్యాంకులు, ఇన్వెస్టర్లను తప్పుడు సమాచారంతో మోసం చేసి నిధులు సమీకరించేందుకు ప్రయత్నించారనేది ప్రధాన ఆరోపణ. ఇందులో అమెరికా ఇన్వెస్టరు సైతం ఉండడంతో.. తమ దేశ పెట్టుబడిదారుల్ని మోసం చేస్తున్నారన్న కారణంతో అమెరికా దర్యాప్తు ప్రారంభించింది. ఈ దర్యాప్తునకు సంబంధించిన అంశాలను తెలుపుతూ.. కోర్టులో ఎఫ్‌బీఐ ఫైలింగ్ చేసింది.రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు.. అదానీ గ్రీన్ ఎనర్జీ గ్రూప్ నుంచి విద్యుత్ కొనుగోలు చేసేలా ఒప్పందాలు చేసుకోవాలి. ఇందుకోసం ప్రభుత్వంలోని కీలక వ్యక్తుల సహకారం కోరిన అదానీ, ఇతర నిందితులు.. ప్రతిగా భారీగా లంచాలు ఆఫర్ చేసినట్లు చెబుతున్నారు. ఇందులో భాగంగా.. భారత ప్రభుత్వంలోని వ్యక్తులకు రూ.2,029 కోట్లు లంచంగా ఇచ్చేందుకు ప్రయత్నించారని ఎఫ్‌బీఐ నివేదికలో పేర్కొంది. విద్యుత్ పంపిణీ సంస్థలు కుదుర్చుకునే ఒప్పందాలతో అదానీ గ్రీన్ ఎనర్జీ, దాని అనుబంధ సంస్థలకు పెద్ద మొత్తంలో లాభం చేకూరుతుందని పేర్కొంది.సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల మధ్య విద్యుత్ విక్రయ ఒప్పందం కుదుర్చేందుకు అదానీ స్వయంగా ప్రయత్నించారు. ఇందుకోసం.. అతను ఆంధ్రప్రదేశ్ లోని అత్యున్నత స్థాయి కార్యనిర్వహాక వ్యక్తిని కలిశారు అని అమెరికా విచారణ సంస్థ ఎఫ్ బీఐ స్పష్టంగా వెల్లడించింది. ఇక్కడే అసలు విషయం పూర్తిగా వెల్లడైంది. అమెరికా విచారణ సంస్థ తేదీలతో సహా తెలిపినట్లుగా..2021లో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిని కలిశారు. నాడు విద్యుత్ సరఫరా ఒప్పందాలపై చర్చలు జరిగినట్లు ప్రభుత్వం తెలపగా.. దాదాపు ఏడు మెగావాట్ల సోలార్ విద్యుత్ కొనుగోలుకు ముఖ్యమంత్రి జగన్ అంగీకారం తెలుపారు. ఇది.. భారత్ లోని మరే ఇతర రాష్ట్రాలు చేసుకోలేనంత భారీ ఒప్పందంగా.. అమెరికా ఫెడరల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ వెల్లడించింది.

# పీఏసీ పదవి దూరమేనా

విజయవాడ, నవంబర్ 22, ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ పీఏసీ ఛైర్మన్ ఎంపిక సైతం వైసీపీకి కలిసివచ్చినట్లు కనిపించడం లేదు. 2019 ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ విజయదుందుభి మోగించి అధికారాన్ని కైవసం చేసుకుంది. అయితే 2024 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం చతికిల పడాల్సి వచ్చింది. దీంతో కేవలం 11 అంటే 11 సీట్లకు మాత్రమే వైసీపీ పరిమితం కావలసి వచ్చింది. దీంతో ప్రధాన ప్రతిపక్ష హోదా కూడా లేకపోవడంతో శాసనసభలో కనీసం ప్రతిపక్ష హోదా లేదన్న విమర్శలను మూటకట్టుకుంది వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ.అయితే ప్రతిపక్ష హోదా ఉండాలి అంటే కనీసమైన సభ్యుల సంఖ్య ఉండాలన్న నిబంధనలు చెబుతున్న నేపథ్యంలో ప్రతిపక్ష హోదా ఇవ్వాలంటూ ఇప్పటికే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కోర్టును సైతం ఆశ్రయించింది. అయితే అనూహ్యంగా సభలో కీలకమైన బాధ్యతలు చేపట్టే పీఏసీ ఛైర్మన్ పదవి ప్రధాన ప్రతిపక్షానికి ఇవ్వవలసి ఉంటుందని వైసీపీ పట్టుపడుతోంది. ప్రధాన ప్రతిపక్షం పదవి కట్టుబెట్టాలన్న నిబంధనలు చెబుతున్న నేపథ్యంలో ప్రస్తుతం శాసనసభలో ప్రధాన ప్రతిపక్షం హోదా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి దక్కేలా లేదనిపిస్తోంది. ఋ నేపథ్యంలో ఎవరు ఆ బాధ్యతను చేపడుతారని ఆసక్తికరంగా మారింది. ఈ నేపథ్యంలోనే వైసీపీకి తగిన సంఖ్యాబలం లేకపోవడంతో జనసేనకు ఛాన్స్ దక్కేలా కనిపిస్తోంది. జనసేన నుంచి పులపర్తి ఆంజనేయులు పేరును ఆపార్ట అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించినట్లు సమాచారం. దీంతో పీఏసీ ఛైర్మన్ పదవిపై ఉత్కంఠ తొలిగింది.పీఏసీ ఛైర్మన్‌గా మొదట పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఆయనతో పాటు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి చంద్రశేఖర్లతో కలిసి నామినేషన్లు దాఖలు చేయగా చివరి నిమిషంలో 20 మంది సభ్యులు ఉంటేనే పీఏసీ ఛైర్మన్‌గా నియమిస్తారని పీఏసీ సభ్యులుగా ఎంపిక కావాలన్నా, ఛైర్మన్‌గా ఎంపిక కావాలన్నా 20 మంది సభ్యుల మద్దతు కావాలని నిబంధనలు చెబుతున్నాయి. ఈ అంశాన్ని తెరపైకి తెచ్చింది అధికార కూటమి.దీంతో అవసరమైన 20 మంది సభ్యులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అసెంబ్లీలో లేని నేపథ్యంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పీఏసీ ఎన్నికయ్యే అవకాశం లేదని చర్చ నడుస్తోంది. ఇప్పటికే కూటమి ప్రభుత్వం నుంచి 12 నామినేషన్లు దాఖలు కాగా పీఏసీలో మొత్తం 12 మంది సభ్యులు అందులో 9 మంది ఎమ్మెల్యేలు ముగ్గురు ఎమ్మెల్సీలు ఉన్నారు. అయితే మొత్తం అన్ని సభ్యులకు కూటమి ప్రభుత్వమే నామినేషన్ దాఖలు చేసింది.పీఏసీ ఛైర్మన్‌గా 2014 ? 2019 మధ్య బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి, 2019 ? 2024 మధ్య పయ్యావుల కేశవ్ బాధ్యతలను నిర్వర్తించగా, తాజాగా 2024 ? 2029 మధ్య ప్రతిపక్ష హోదా లేని పార్టీగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉండటంతో ఆ బాధ్యతలను కూటమి ప్రభుత్వంలోని కీలక నేతకు కట్టబెట్టే అవకాశం ఉంది. ప్రధాన ప్రతిపక్ష హోదా లేకపోవడం సభలో సంఖ్యాబలం లేని కారణంగా ప్రతిపక్ష హోదా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి లేన నేపథ్యంలో పీఏసీ ఛైర్మన్ నియామకం కూడా దక్కదన్న చర్చ నడుస్తోంది. అయితే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలు మాత్రం తమకు 40 శాతం ఓట్ షేర్ ఉందని శాసనసభలో అధికార పక్షం, ప్రతిపక్షం రెండే ఉంటాయి. కాబట్టి ఆదిశగా నిర్ణయం తీసుకోవాలని వైసిపి డిమాండ్ చేస్తుంది. కాగా, అధికారం కోల్పోయిన వైసీపీకి తాజా ఎన్నికల్లో వచ్చిన ఫలితాలు పెద్ద దెబ్బ తగిలితే, ఇప్పుడు కీలకమైన పీఏసీ ఛైర్మన్ పదవి సైతం చేజారినట్లు కనిపిస్తోంది..!

# డిజిటల్ మీడియా పేరుతో దోచేశారు

కడప, నవంబర్ 22, రుకు ప్రభుత్వ కాంట్రాక్టు ఉద్యోగులు..చేసేదంతా పార్టీ ప్రచారం. ప్రచారమంటే అది మామూలు ప్రచారం కాదు. విషం చిమ్మడే పని అంటున్నారు. సోషల్ మీడియాలో నీచమైన పోస్టులు, వికృత వీడియోలు, అడ్డగోలు కామెంట్స్ పెట్టడమే వాళ్ల డ్యూటీ అంట. ఆఫీస్‌కు పోవాల్సిన పనిలేదు. ప్రభుత్వం చేస్తున్న మంచిని చెప్పాల్సిన అవసరం అంతకన్నా లేదు. ఎక్కడ ఉన్నా ప్రాపగండ చేస్తే చాలంటూ వాళ్లకు బాధ్యత అప్పగించారట. కట్ చేస్తే లక్షలకు లక్షలు జీతాలు తీసుకుంటూ రెచ్చిపోయినోళ్ల తిక్క కథలు అంతా ఇప్పుడు బయటికి వస్తోంది. ఇలా కూడా చేయొచ్చా అన్నట్లుగా..ఓ మూడు కార్పోరేషన్ల నుంచి..ప్రభుత్వ డబ్బును ప్రసాదంలా పంచేశారట. సర్కార్ కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రచారం చేయాల్సిన కార్పొరేషన్ నుంచి నెలనెలా ప్రజాధనాన్ని జీతం ఇస్తూ..కూటమి నేతలు, వారి కుటుంబసభ్యుల మీద నీచమైన పోస్టులు పెట్టించారట. ఇదంతా వైసీపీ పెద్ద లీడర్ల డైరెక్షన్‌లో జరిగిందని..అప్పటి విషనాగుల వివరాలన్నీ ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయని చెప్తున్నారు కూటమి నేతలు.చంద్రబాబు, పవన్ కల్యాణ్ కుటంబసభ్యులే కాదు..వైఎస్ షర్మిల, సునీతా మీద అడ్డగోలుగా, అసభ్యంగా పోస్టులు పెట్టిన పలువురిని..కొద్ది రోజులుగా అరెస్ట్ చేస్తూ వస్తున్నారు పోలీసులు. అందులో కొందరిని విచారించగా అసలు విషయం బయటికి వచ్చిందట. కూటమి పార్టీల నేతలు, వారి కుటుంబసభ్యుల మీద పోస్టులు పెట్టే వ్యవహారం ఆర్గనైజ్డ్ క్రైమ్‌గా నడిచిందని గుర్తించారట. పక్కా ప్లాన్‌తో వైసీపీ పెద్దల డైరెక్షన్‌లో రాష్ట్ర స్థాయి నుంచి గ్రామీణ స్థాయి వరకు అందరికీ పోస్టర్లు డిజైన్ చేసి పంపిస్తారని..వాటిని వాళ్లు సోషల్ మీడియాలో పెడతారని పోలీస్ విచారణలో తేలిందట. అలా పోస్టులు పెట్టినందుకు కొందరికి అయితే లక్షలకు లక్షలు జీతాలు ఇచ్చారట. ఈ విషయాన్ని అరెస్ట్ అయిన వైసీపీ సోషల్ మీడియా కోఆర్డినేటర్లే పోలీసులకు చెప్పడంతో..ఈ మ్యాటర్ తెలిసి కూటమి నేతలు షాక్ అయినట్లు తెలుస్తోంది.కడప ఎంపీ అవినాశ్ రెడ్డి అనుచరుడు వర్రా రవీంద్రా రెడ్డి కేసులో పోలీసులు తీగ లాగితే సోషల్ మీడియా పోస్టుల బాగోతం కథ మొత్తం బయటపడినట్లు చెబుతున్నారు. మొత్తం 46 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలుస్తోంది. వీరంతా నెలనెలా ప్రభుత్వ నుంచి జీతాలు తీసుకుంటూ..అప్పటి ప్రతిపక్ష నేతలు, వారి కుటుంబ సభ్యులైన మహిళల మార్ఫింగ్ ఫోటోలతో అసభ్యకర, నీచమైన కామెంట్స్‌తో ప్రచారం చేయడమే పనిగా పెట్టుకున్నట్లు దర్యాప్తులో తేలిందంటున్నారు. ఈ 46 మందిలో 30 మంది ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ద్వారా జీతాలు తీసుకున్నట్లు విచారణలో గుర్తించారట.మిగిలిన వారికి ఏపీ ఈ ప్రగతి ఏపీ ఫైబర్ నెట్, ఏపీ స్కిల్ డెవలప్ మెంట్ నుంచి శ్యాలరీస్ ఇచ్చారని అంటున్నారు. నిందితుల్లో 30 వేల రూపాయల నుంచి 3 లక్షల రూపాయల వరకు జీతాలు తీసుకున్నారని..అందులో ముగ్గురికి రెండు లక్షల 80 వేల జీతం 50 వేల రూపాయలు ఇతర అలవెన్స్ కూడా ఇచ్చినట్లు టాక్. ఒక్కరు కాదు ఇద్దరు కాదు ఏకంగా 130 మంది ఉద్యోగులతో డిజిటల్ మీడియా కార్పొరేషన్‌ను రన్ చేసిన వైసీపీ..వాళ్లందరినీ పార్టీ ప్రచారం కోసం, ప్రత్యర్థుల మీద దుష్ప్రచారం చేసేందుకు వాడుకుందంటున్నారు. కేసు దర్యాప్తులో భాగంగా తాడేపల్లిలోని ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఆఫీస్‌లో తనిఖీలు చేసిన కడప పోలీసులు కీలక ఆధారాలు సేకరించినట్లు తెలుస్తోంది.వైసీపీ సోషల్ మీడియా ఇంచార్జ్ సజ్జల భార్గవ్‌రెడ్డి డైరెక్షన్‌లో..పక్కా ప్లాన్ ప్రకారం ఇదంతా జరిగిందనేది కూటమి నేతల ఆరోపణ. ఆయనకు సన్నిహితులుగా ఉన్నవారు, వైసీపీ మద్దతుదారులకు నెలనెలా జీతాలు ఇచ్చి..అడ్డగోలుగా పోస్టులు పెట్టించేవారని పోలీసుల దర్యాప్తులో తేలిందంటున్నారు. వైసీపీ సోషల్ మీడియా కేంద్రంగా తయారయ్యే పోస్టులను..పోస్ట్ చేయడమే వీళ్ల పని అంటున్నారు. నిందితుల్లో ఎక్కువ మంది ఒకే సామాజికవర్గం వారు ఉన్నారంటున్నారు కూటమి నేతలు. వాళ్లందరికీ బంధుత్వం కూడా ఉన్నట్లు ఆరోపిస్తున్నారు. ఇలా కడప పోలీసుల దర్యాప్తులో బయటికి వచ్చిన బాగోతం ఇప్పుడు కొత్త టర్న్ తీసుకుంటోంది.ఇప్పటికే అసభ్యకర పోస్టులు, మహిళలను కించపరిచారంటూ కేసులు నమోదు అవుతుంటే..ప్రభుత్వ సొమ్ము దుర్వినియోగం మీద ఉన్నతస్థాయి విచారణ జరిగే అవకాశం కనిపిస్తోంది. ఈ సెగ ఏకంగా వైసీపీ పెద్ద నేతల దాకా వెళ్లే అవకాశం కూడా ఉందంటున్నారు. కార్పొరేషన్ల ఏర్పాటు చేసింది ఎందుకోసం? వాళ్లందరినీ ఉద్యోగులుగా ఎలా నియమించారు.? పార్టీ కోసం వాడుకుని ప్రభుత్వం నుంచి జీతాలు ఎందుకు ఇచ్చినట్లు.? ఈ ఓవరాల్ ఎపిసోడ్ వెనక మాస్టర్ మైండ్ ఎవరు..వాళ్లకు వంత పాడిందెవరనే దానిపై కూటమి సర్కార్ కూపీ లాగుతోందట. ఈ వ్యవహారంలో పెద్ద ఎత్తున అరెస్టులే కాదు..కార్పొరేషన్ల ద్వారా పార్టీ సానుభూతిపరులకు ఇచ్చినట్లు చెప్తున్న జీతాల రికవరీ కూడా చేస్తామంటున్నారు కూటమి నేతలు.

# శారీరక దృఢత్వం మానసిక వికాసం కొరకు వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ నిర్వహణ....

నంద్యాలజిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదేశాలమేరకు నంద్యాల పట్టణంలోని జిల్లా పోలీస్ కార్యాలయం ఎదురుగా గల మైదానం నందు నంద్యాల సబ్ డివిజన్ పోలీస్ అధికారులు మరియు వారి సిబ్బందితో వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా పోలీసు అధికారులు మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఈ వీక్లీ పోలీస్ పెరేడ్ డ్రిల్ల్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తప్పనిసరిగా సాయుధ బలగాల సిబ్బంది సివిల్ పోలీసులు అందరూ హాజరుకావాలని తెలియజేశారు.పెరేడ్ డ్రిల్ చేయడం ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం కలుగుతుంది.ప్రతి శుక్రవారం పోలీస్ డ్రిల్ మాత్రమే కాకుండా యోగ ఫిజికల్ ట్రైనింగ్ మొదలగునవి నిర్వహించడం జరుగుతుంది.వివిధ రకాల పోలీస్ డ్యూటీలలో ఉన్న అందరూ ఒకే చోట కలవడం ద్వారా సమస్యలు అధికారులకు తెలియజేయడం మరియు ఈ పెరేడ్ డ్రిల్ కార్యక్రమం ఒక రీఫ్రెష్ కోర్సులా సిబ్బందికి ఉపయోగపడుతుందని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ ఎస్పీ చంద్రబాబు, నంద్యాల సబ్ డివిజన్ డి.ఎస్.పి శ్రీనివాసరెడ్డి, ఒఖీ డి.ఎస్.పి శ్రీనివాసులు, సాయుధ బలగాల సిబ్బంది, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

# మాట నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు

**కూటమి ప్రభుత్వంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం**

**బద్వేలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు ప్రముఖ కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి**

బద్వేలు నేటికి కూటమి ప్రబుత్వం ఏర్పాటు అయ్యి 150 రోజులు. పూర్తి అయిన శుభ సందర్భంగా మన ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు నాయుడు ప్రజాగలం నందు చెప్పిన మాట ప్రకారం ప్రబుత్వం ఏర్పాటు చేసిన వెంటనే లాండ్ టైటిల్ యాక్ష రద్దు -పై సంతకం చేసినారు నేడు అసెంబ్లీ లో హైకోర్టు బెంచి ఏర్పాటు చేయుటక న్యాయ శాఖ మంత్రి వర్యులు ఫరూక్ గారు తీర్మానాన్ని ప్రవేశ పెట్టగా మన ముఖ్య మంత్రి నారా చంద్ర బాబు చొరవతో శాసన సభ్యుల అంగీకారంతో మరీ ముఖ్యముగా రాయలసీమ కొనసీమ సభ్యుల అంగీకారంతో కర్నూలు నందు హైకోర్టు బెంచి ఏర్పాటుకు శాసనసభ ఆమోదంపట్ల బద్వేలు తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు ప్రముఖ కాంట్రాక్టర్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి హర్షం ప్రకటించారు . నాటి శ్రీబాగ్ ఒడంబడిక ప్రకారము కర్నూలు నందు రాజదాని గాని హైకోర్టు గాని ఏర్పాటు చేయుటకు తీర్మానం అయినది కాని కర్నూలు నందు రాజ దాని ఏర్పాటు చేసినను అది మూనాళ్ళ ముచ్చటగా ఆంధ్ర ప్రదేశ్ విప్పటు చేసుకున్న మనం హైకోర్టును హైదరాబాదుకు తేరలలించటమైనది ఆనాటి నుంచి ఈ నాటి వరకు రాయల సీమలో హైకోర్టు ఏర్పాటు చేయుటకు న్యాయ్యవాదులు అనేక పోరాటాలు చేయడమైనది. గత ప్రభుత్యం కర్నూలులో హైకోర్టు రాజదానిగా. ఏర్పాటు చేస్తామని చెప్పి వారి రాజకీయ స్వలాబం చూసుకున్నారు హైకోర్టు ఒకే చోట ఉండడం ఉత్తమము అని ప్రజలకు న్యాయస్థానాలు అందుబాటులో ఉంచి త్వర తగతిన న్యాయం పొందుటకు నేడు కూటమి ప్రభుత్వం నారా చంద్ర బాబు నాయకత్వం తో మన రాయలసీమ వాసుల కలను నెరవేరుస్తూ ఈనాడు కర్నూలు నందు హైకోర్టు బెంచి ఏర్పాటు చేయట అభినందననీయ విషయం అని ప్రభుతం ఏర్పాటు అయినప్పట్టనండి రాష్ట అభివృద్ధి ప్రజా సంక్షేమం కోసం కష్టపడుతున్నట్లు మంచూరు సూర్యనారాయణ రెడ్డి తెలిపారు

# పదవ తరగతి విద్యార్థిని పై కర్రతో దాడి

**గత కొన్ని రోజులుగా వేధిస్తూ ఇంటికి వెళ్లి మరీ దాడి చేసిన నిందితుడు**

నెల్లూరు,నెల్లూరు జిల్లా మర్రిపాడు మండలం బ్రాహ్మణ పల్లి లో అమానుష ఘటన చోటుచేసుకుంది, పదో తరగతి చదువుతున్న విద్యార్థినిని అదే ప్రాంతానికి చెందిన మాదర్ అనే వ్యక్తి కొన్ని రోజులుగా ప్రేమించాలని వేధిస్తూ వున్నాడు. గురువారం సాయంత్రం బాలిక ఇంటికి వెళ్లి కర్ర తో తల మీద దాడిచేయగా విద్యార్థినికి గాయాలయ్యాయి. విద్యార్థిని తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కూతురుని అదే ప్రాంతానికి చెందిన మాదర్ అనే వ్యక్తి గత కొన్ని రోజులుగా వేధిస్తున్నాడని తాము ఎన్నిసార్లు చెప్పినా తమ మాట వినడం లేదని హఠాత్తుగా ఈరోజు కత్తి కర్ర తీసుకువచ్చి తమ ఇంటి మీద దాడికి వచ్చాడని తమ కూతురి మీద దాడి చేయబోవుగా అడ్డుకున్న తల్లి పైన కూడా దాడి చేశాడని కర్రతో తమ కూతురి తలపై కొట్టడంతో గాయాలు అయ్యాయని అన్నారు. ఈ మాదర్ నుండి తమ కుటుంబానికి తమ కూతురుకు ప్రాణహాని ఉందని విద్యార్థిని తల్లితండ్రులు వాపోతున్నారు, ఇప్పటికైనా పోలీసులు స్పందించి తమకు న్యాయం చేయాలని మాదర్ నుండి తమకు రక్షణ కల్పించాలని కోరుతున్నారు...

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు

కొత్తగూడెంత్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కూలీ లైన్లో కొత్తగూడెం సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ ఆధ్వర్యంలో ఈరోజు కొత్తగూడెం త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కూలీ లైన్ లో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం ను నిర్వహించడం జరిగింది.ఇందులో భాగంగా మొత్తం సుమారుగా 250 ఇండ్లలో సోదాలు నిర్వహించడం జరిగింది. సరిగా పత్రాలు లేకుండా నెంబర్ ప్లేట్లు లేని 16 వాహనాలను సీజ్ చేయడం జరిగింది.అదే విధంగా 11 వాహనాలకు 2400/- రూపాయల జరిమానా విధించడం జరిగింది.ఇద్దరు బెల్ట్ షాపు నిర్వాహకుల నుండి సుమారుగా 14,000/- ల రూపాయల మద్యం బాటిలను సీజ్ చేయడం జరిగింది. అనంతరం కూలీ లైన్ కాలనీ వాసులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి కొత్తగూడెం డిఎస్పి రెహమాన్ పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్ట వ్యతిరేక మరియు సాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల గురించి సమాచారం తెలిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని కోరారు.తమ ప్రాంతంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే సంబంధిత అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.మట్కా,జూదం,బెట్టింగ్,గంజాయి రవాణా వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేకంగా నిఘా ఏర్పాటు చేయడమైనదని తెలిపారు.ఇట్టి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తుల సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని తెలియజేసారు.ఈ కార్యక్రమంలో సుమారుగా 100 మందికి పైగా పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# ఆలయంలో చోరీ ఇద్దరి అరెస్టు

మేడ్చల్,మేడ్చల్ జిల్లా పోచారం ఐటి కారిడార్ పోలీస్ స్టేషన్ పరిధి ఫకిటెక్యా తండాలోని ఎల్లమ్మ ఆలయంలో చోరీ జరిగింది. గర్భగుడిలో ఉన్న అమ్మవారి విగ్రహంతో పాటు 5గ్రాముల బంగారు పుస్తెలు, 5తులాల వెండి కళ్లను ఇద్దరు దొంగలు దొంగిలించారు. చోరీ జరిగిందని పూజారి పోచారం పోలీసులకు ఫిర్యాదు చేసాడు. సీసీటీవీ కెమెరాల సహాయంతో కీసర ఆర్ జీకే కాలానికి చెందిన ఇద్దరు వ్యక్తులను పోలీసులు గుర్తించారు. కీసర ఆర్ జీకే కాలనీలో ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్ కి తరలించారు.

# బాలికపై గ్యాంగ్ రేప్..

కడప ,కడప నగర శివారులోని చింతకొమ్మదిన్నె పోలీస్ స్టేషన్ పరిధిలో మద్దిమడుగులో నెల రోజుల కిందట మైనర్ బాలికను ఇద్దరు అత్యాచారం చేశారు. ఇద్దరిలో ఒకరు మైనర్ కావడం గమనార్హం. వీరిద్దరితోపాటు తోడుగా ఓ బాలుడు వెళ్ళాడు. నెల రోజుల తర్వాత కడపలోని దిశా పోలీస్ స్టేషన్లో గురువారం ఫిర్యాదు చేశారు. బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారించి చింతకొమ్మదిన్నె సిఐ శంకర్ నాయక్ ఆధ్వర్యంలో ఫోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ఈ సంఘటనలో ముగ్గురు నిందితులు పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.

# రామకుప్పంలో కిడ్నాపర్ల ముఠా అరెస్ట్

చిత్తూరు,కుప్పం నియోజకవర్గంలోని రామకుప్పంలో కిడ్నాపర్ల ముఠాను గురువారం రాత్రి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ నెల 14న మండలంలోని గోవిందపల్లి మాజీ సర్పంచ్ కుటుంబాన్ని ఐటీ శాఖ పేరుతో కిడ్నాప్ చేసిన సంగతి పాఠకులకు విధితమే. ఈ కేసులో ప్రధాన నిందితులు ఏడుగురిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు. అరెస్ట్ అయిన నిందితుల చెంత మూడు వాహనాలు సీజ్ చేశారు. రైస్ పుల్లింగ్ వ్యవహారంతో పాటు ఆర్థిక లావాదేవీలే కిడ్నాప్ కు కారణమని తెలిసింది.

# సిపిఎం పట్టణ కార్యదర్శి గా లక్ష్మణ్



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 22- సిపిఎం నంద్యాల పట్టణ కార్యదర్శి గా లక్ష్మణ్ ను ఎన్నుకున్నట్లు. సిపిఎం నాయకులు తెలిపారు. శుక్రవారం సిపిఎం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో సిపిఎం నాయకులు మాట్లాడుతూ పట్టణ కార్యదర్శి గా లక్ష్మణ్ ను అలాగే పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులుగా పి నరసింహ, కే మహమ్మద్ గౌస్, పి వెంకట లింగం, పట్టణ కమిటీ సభ్యులుగా మౌలాలి, శివ, భాస్కరాచారి,గోపాల్ లతో పాటు నలుగురు సభ్యులను కో ఆప్షన్ గా ఎన్నుకోవడం జరిగిందని వారు తెలిపారు.

# మాస శివరాత్రి లక్ష బిల్వార్చన



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 22- మహానంది పుణ్యక్షేత్రంలో ఈనెల 29,30 తేదీల్లో కార్తీక మాసపు ముగింపు ఉత్సవాలు జరుగుతాయని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈవో మాట్లాడుతూ నంద్యాల రామకృష్ణ విద్యాసంస్థల అధినేతలైన గడ్డం రామకృష్ణారెడ్డి, విజయకుమారి గార్ల సహకారంతో నవంబర్ 29,వ తేదీ శుక్రవారం కార్తీక మాస, మాసశివరాత్రిని పురస్కరించుకుని శ్రీ మహానందీశ్వర స్వామి వారికి మహాన్యాస పూర్వక మహారుద్రాభిషేకం, సాయంత్రం ప్రదోష కాలంలో లక్షబిల్వార్చన, చండీయాగం. మరియు 30,వ తేదీ శనివారం కార్తీక అమావాస్య రోజున శ్రీ కామేశ్వరీ అమ్మవారికి లక్ష కుంకుమార్చన, విశేష హోమాలు, పూర్ణాహుతి సాయంత్రం శాంతి కల్యాణోత్సవము వైభవంగా జరుగుతాయని తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ వేద పండితులు దేవస్థానం సూపరింటెండెంట్ శశిదర్ రెడ్డి. అధికారులు పాల్గొన్నారు.

# మహానందిశ్వర సన్నిధి లో ఎంపీపీ



--విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 22- నంద్యాల జిల్లా మహానంది క్షేత్రంలో శుక్రవారం శ్రీ మహానందీశ్వర, శ్రీ కామేశ్వరి అమ్మవారు లను దర్శించుకున్న మహానందిన మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు(ఎంపీపీ) బుడ్డారెడ్డి యశస్విని, సోదరి బుడ్డారెడ్డి కౌశస్విని . ముందుగా వీరికి ఆలయ మర్యాదలతో దేవస్థానం అధికారులు స్వాగతం పలికి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేద పండితులు ఆశీర్వాదచనాలు చేసి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక రాజేశ్వరి లాడ్జి నందు ఎన్ ఎం యు సర్వసభ్య సమావేశం..

విభారే న్యూస్ నవంబర్ 22 ఎమ్మిగనూరు.స్థానిక ఏపీఎస్ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ ఎమ్మిగనూరు రాజేశ్వరి లాడ్జ్ మీటింగ్ హాల్ నందు సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ఎన్ ఎం యు ఏ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ పి ఎం సాబ్ అధ్యక్షత వహించి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎన్ఎంయుఏ రాష్ట్ర కార్యదర్శి పిఎండి ఇస్మాయిల్, రీజనల్ కార్యదర్శి మద్దిలేటిలు పాల్గొన్నారు.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రాష్ట్ర కార్యదర్శి పిఎండి ఇస్మాయిల్ మాట్లాడుతూ సమస్యలను పరిష్కరించే దిశలో ఎన్ఎంయుఏ అధ్యక్షులు ప్రధాన కార్యదర్శి అహర్నిశలు కృషి చేస్తున్నారని డిపో స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు ఉద్యోగులు కలిసికట్టుగా పనిచేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఈనెల ఏడవ తేదీన విజయవాడలో జరిగిన ఎన్ ఎం యు ఏ విస్తృత స్థాయి సమావేశంలో ఎన్ ఎం యు ఏ విజయవాడలో సొంత బిల్డింగ్ను కట్టించాలని తీర్మానాన్ని చేశారని దానికి సంబంధించి ఉద్యోగులు తమ విరాళాలను ప్రకటించాలని వై ఆర్ చంద్ర 15116, ఎన్ఫీఎం సాహెబ్11116, ఎస్ఎం రఫీక్ 10000,యు ఎమ్ శేఖర్5116, యు గోపి రిటైర్డ్ 5116, తిమ్మప్ప2116, కోసిగయ్య2016,అందజేశారు. మద్దిలేటి మాట్లాడుతూ విలీనానంతర ఏపీఎస్ఆర్టీసీలో సమస్యలపై నేషనల్ మత్తు యూనిటీ అసోసియేషన్ ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం పాటుపడుతుందని విలీనానంతరం అపరిష్కృత సమస్యలు పరిష్కరించేందుకు ఎన్ఎంయు ఏ లిఖితపూర్వకంగా సమస్యల పరిష్కారం కోసం అనంతరం కృషి చేస్తుందని ప్రభుత్వానికి తెలియజేయడంలో ముందంజలో ఉందని ఆయన తెలిపారు. సమస్యల విషయానికొస్తే ఇదివరలో ప్రతి ఆర్టీసీ ఉద్యోగికి నగదు రహిత వైద్య సదుపాయము ఉండేదని ఈ హెచ్ ఎస్ విధానాన్ని రద్దు పరచి పాత అపరిమిత వైద్యసేవల విధానాన్ని కొనసాగించాలని, ప్రయాణికులు టిక్కెట్ తీసుకోకపోతే డ్రైవర్ కండక్టర్లకు విధిస్తున్న జరిమానాలకు సంబంధించి 2019 సర్కులర్ను తిరిగి అమలు చేయడం చేయాలని, సంస్థాగతంగా ఖాళీ స్థానాల్లో సిబ్బందిని భర్తీ చేయాలని, స్క్రాప్ కు వెళ్లే బస్సులను నిలుపుదల చేయాలని ఆ స్థానంలో కొత్త బస్సులను కొనుగోలు చేయాలని, డిమాండ్కు అనుగుణంగా 5000 కొత్త బస్సులను వెంటనే కొనాల్సిన అవసరం ఉందని, డిపోలో జరుగుతున్న కొన్ని సమస్యల గురించి తమదాకా వచ్చిందని వాటి గురించి పరిష్కార



దిశగా కర్నూల్ లోని డి పి టి ఓ తో మాట్లాడతామని, సమస్యలు పరిష్కరించే దిశగా చూస్తామని ఆయన అన్నారు.ఈ మధ్యకాలంలో కొన్ని కొత్త బస్సులు వచ్చి బి6, బిఫోర్ అంటూ వచ్చిన బస్సులకు రిపేర్ చేయుటకు అన్ని డిపోలకు మెకానిక్ సోదరులకు సరిపోవు పనిముట్లు ఇవ్వాలని వీలైతే వారిని కొత్తగా వచ్చిన బస్సులను ఎలా రిపేర్ చేయాలో ట్రైనింగ్ ద్వారా తెలపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష ,కార్యదర్శులు ఎస్ఎం రఫీ, ముస్తాక్ అహ్మద్ గ్యారేజీ కార్యదర్శి భాస్కర్ పెయింటర్, జిబి నవాజ్, కే మదర్ సాబ్, ఎమ్మెల్ రెడ్డి, షరీఫ్,బజారప్ప, తదితరులు పాల్గొన్నారు.

# ఆయుధాల పనితీరు పై పరిజ్ఞానం పెంచుకోండి

**- జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్.**

విభారే న్యూస్ నవంబర్ 22 కర్నూలు జిల్లా ప్రతినిధి..వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ లో పాల్గొని,ఆయుధాల నైపుణ్యాలను పరీక్షించిన జిల్లా ఎస్పీ.కర్నూలు పోలీసు అధికారులు,సిబ్బంది తమ విధుల్లో వినియోగిస్తున్న ఆయుధాల పనితీరుపై పరిజ్ఞానం పెంపొందించుకోవాలని కర్నూలు జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ తెలిపారు.ఈ సంధర్బంగా జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్ ఐపియస్ శుక్రవారం వార్షిక ఫైరింగ్ ప్రాక్టీస్ లో పాల్గొన్నారు.ఏ.కె 47,ఎస్ ఎల్ ఆర్,పిస్టల్ ల ద్వారా జిల్లా ఎస్పీ ఫైరింగ్ సాధన చేశారు.ఆయుధ నైపుణ్యాలను పరీక్షించారు.జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో కర్నూలు మండలం, దిన్నేదేవరపాడు గ్రామ దగ్గర ఉన్న జగన్నాథగట్టు సమీపంలోని ఫైరింగ్ రేంజ్ లో పోలీసు అధికారులు, సిబ్బందికి 2024 సంవత్సరంకు గాను 5 రోజుల పాటు ఫైరింగ్ ప్రాక్టీస్ నిర్వహించారు. ఫైరింగ్ ప్రాక్టీస్ లో పోలీసులు విధుల్లో వినియోగించే ఆయుధాలతో ఫైరింగ్ చేయించారు.ఫైరింగ్ లో ప్రతిభ కనబరచిన పోలీసు అధికారులను,సిబ్బందిని అభినందించారు.అధికారులు,సిబ్బందికి ఫైరింగ్ గురించి జిల్లా ఎస్పీ దిశా నిర్ధేశనీ చేశారు.ఫైరింగ్ లో ప్రతి ఒక్కరు పాల్గొని మంచి మెళకువలు నేర్చుకోవాలన్నారు.శాంతి భద్రతల



పరిరక్షణలో పోలీసుల సేవలు చాలా కీలకమన్నారు .అత్యవసర సమయాలలో ప్రజల మాన,ధన,ప్రాణ రక్షణకై ఎల్లవేళలా సంసిద్ధులై ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్, కర్నూలు డిఎస్పీ జె.బాబు ప్రసాద్, ఎఆర్ డిఎస్పీ శ్రీనివాసరావు,సిఐలు ప్రసాద్,కేశవరెడ్డి,ఆర్ ఐలు సోమశేఖర్ నాయక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలలో నిర్మాణ పనులు పూర్తి చేయండి

**---జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా**

---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 22--జిల్లాలో 439 అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, త్రాగునీటి పైపు లైన్ నిర్మాణ పనులు చేపట్టి పెండింగ్లో ఉన్న 73 పనులను త్వరితగతిన పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓ లను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఎన్ఐసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్వాడీ కేంద్రాలలో టాయిలెట్లు, మంచినీటి సౌకర్యంపై ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓలతో సమీక్ష నిర్వహించారు. ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ మనోహర్, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ లీలావతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ 439 అంగన్వాడీ కేంద్రాలలో 231 టాయిలెట్లకు గాను 191 పూర్తయ్యాయని పెండింగ్ లో ఉన్న 40 టాయిలెట్ల నిర్మాణాలు, అలాగే 425 తాగునీటి





పైప్ లైన్లకు గాను 390 త్రాగునీటి పైప్ లైన్ పనులు పూర్తి అయ్యాయని మిగిలిన 33 త్రాగునీటి పైప్ లైన్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆర్డబ్ల్యూఎస్ ఇంజనీరింగ్ అధికారులు, సిడిపిఓ లను ఆదేశించారు. ఇంకా మొదలుపెట్టని పనులను వెంటనే ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పురోగతిలో ఉన్న నిర్మాణాలు వెంటనే పూర్తి దశకు చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఫీజుబిలిటీ మేర ఎంతవరకు చేయగలిగితే ఆమేర పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఆదివారం యాదవ కార్తీక వనభోజన



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 22-- నంద్యాల జిల్లా పద్మావతి నగర్ లో వెలసిన శ్రీ కృష్ణ భగవాన్ మందిరం నందు మొట్టమొ దటిసారిగా యాదవ కార్తీక వనభోజన కార్యక్రమాన్ని ఆదివారము (24-11-2024) ఏర్పాటు చేయడమైనదని యాదవ కమిటీ సభ్యులు తెలిపారు. నంద్యాల పట్టణ ముందు మరియు నంద్యాల పరిసరప్రాంతాలలోని యాదవ సోదరులు ,సోదరీమణులు కుటుంబ సమేతంగా విచ్చేసి జయప్రదం చేయాలని నంద్యాల యాదవ కార్తీక వనభోజన కమిటీ వారు తెలిపారు . ఆదివారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు పూజా కార్యక్రమాలు మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఆటలు పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యాదవ పెద్దలు ,పిల్లలు అందరూ పాల్గొని విజయవంతం చేయాలని నంద్యాల యాదవ కార్తీక కమిటీ బోదనం చంద్రశేఖర్ యాదవ్ పృథ్వీరాజ్ యాదవ్ విజయ గౌరీ యాదవ్ గొర్ల సత్యనారాయణ యాదవ్ పార్థసారధి యాదవ్ చంద్రుడు యాదవ్ తెలిపారు.


# అమెరికా పర్యటన లో ఎంపీ బైరెడ్డి శబరి




విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి నవంబర్ 22-నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి అమెరికా దేశ పర్యటన కొనసాగుతోంది. అగ్రరాజ్యం అమెరికా దేశం న్యూయార్క్ నగరంలో ఈ నెల 18 వ తేదీ నుంచి 22 వ తేదీ వరకు 79 వ యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయని, ఈ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు వెళ్లిన ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి ఇప్పటికే ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అధ్యక్షులు హెచ్.ఇ . ఫిలెమోన్ యాంగ్ తో పాటు నమిబియా శాశ్వత ప్రతినిధి నెవిల్లే మెల్విన్ గెర్ట్జ, ఐక్యరాజ్య సమితి డిప్యూటీ సెక్రటరీ జనరల్ అమీనా మొహమ్మద్ లతో పాటు ప్రపంచ దేశాల ప్రతినిధులు, ఐక్యరాజ్య సమితి ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు.అలాగే యునైటెడ్ నేషన్ ఆఫ్ ఫైనాన్స్ చైర్మన్ అబ్దుల్లా బబార్ బాంగ్, ఉగ్రవాద నిరోధక యు ఎన్ అండర్ సెక్రటరీ జనరల్ వ్లదిమీర్ వొడొన్కోవ్, జర్మన్ రాయబారీ అంట్లజ్ లీండర్ స్ట్ లతో భారత ప్రతినిధిగా ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి సమావేశం అయ్యారు.

# శ్రీశైలం దేవస్థానంలో అపోలో వైద్యశాల ఈవోపరిశీలన

శ్రీశైలం దేవస్థానం లోపరిపాలనాంశాలలో భాగంగా ఈ రోజు గురువారం కార్యనిర్వహణాధికారివారు దేవస్థాన వైద్యశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యశాలలో మెరుగైన వైద్యసేవలను అందించాలని వైద్యులకు సూచించారు. ఏ సమయములోనైనా అత్యవసర వైద్యం అందించేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. స్థానికులకు, యాత్రికులకు అవసరమైన వైద్యసేవలను అందించడం పట్ల ప్రత్యేకశ్రద్ధ కనబర్చాలని వైద్యవిభాగాన్ని ఆదేశించారు.అదేవిధంగా వైద్యశాలకు అవసరమైన ఆధునిక వైద్యపరికరాలు కూడా వెంటనే కొనుగోలు చేయాలని కూడా ఆదేశించారు.ముఖ్యంగా వైద్యం కోసం వచ్చే రోగుల సంఖ్యకనుగుణంగా దేవస్థానం వైద్యశాలలో ఆయా ఔషధాలను అందుబాటులో ఉంచాలని వైద్యవిభాగాన్ని ఆదేశించారు.





గుండెజబ్బులు మొదలైనవాటికి సంబంధించిన అత్యవసర ఔషధాలు కూడా అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు వైద్యశాలకు అవసరమైన ఆయా ఔషధాల జాబితాను సంబంధిత అధికారులకు అందజేస్తుండాలని వైద్యులకు సూచించారు.దేవస్థానం వైద్యశాలను మరింతగా అభివృద్ధి పరిచి, ఇంకా మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టాల్సిన చర్యల గురించి దేవస్థానం వైద్యశాలలో విధులు నిర్వహిస్తున్న అపోలో వైద్యులు మరియు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించారు.ఈ పరిశీలనలో ఎగ్జిక్యూటీవ్ ఇంజనీరు ఎం.నరసింహారెడ్డి, సహాయ ఇంజనీర్లు పాల్గొన్నారు

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190